

# ఇదం శరీరం

■ చంద్రలత
■ చిత్రాలు: గోపీనాథ్

ఇంత చిన్న విషయానికి అంత పెద్ద రాద్ధాంతం జరుగుతుందని నేను కలలో కూడా అనుకోలేదు. బహుశా ఇంతకు మునుపు ఎన్నడూ ఇలా జరగకపోవడం వలనే కావచ్చు.

అక్షతతో ఇదే చిక్కు. దేనికి ఎలా స్పందిస్తుందో పెళ్ళయి ఇన్నేళ్ళయినా నాకు ఈనాటికీ అర్థం కాదు.

అంత సులువుగా అర్థం చేసుకోగలిగితే ఇక అక్షతతో వచ్చే ఇబ్బంది ఏముంది కనుక!

అందుకేనేమో ఈ మధ్యన తరచూ అంటోంది- "ప్రవీణ్, కాస్త నన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు". అంటూ.

నిజానికి ఆమె తరుచుగా ఆ మాట అనాల్సి రావడం నాకు అవమానకరంగానే ఉంది. కానీ, ఏం చేయను?

రానురానూ ఆమె సరళత సంక్లిష్టమైపోతోంది.

అసలు ఈ అర్థం చేసుకోవడం అనే అంశమే మా ఇద్దరి మధ్యన అపార్థానికి దారి తీస్తోందని నా ప్రగాఢ విశ్వాసం. కానీ, ఆమె ధోరణి ఆమెదే.

ఎటొచ్చీ, ఇవ్వాళిటి ఆమె వాక్యాలు మరోలా ఉన్నాయి.

"ఆవిడను అర్థం చేసుకోవడానికి మీరెవరూ ఎందుకు ప్రయత్నం చేయరు? అసలు ఆమెను అర్థం చేసుకోవాల్సిన అవసరమైనా ఉందని మీరు గుర్తించినట్లుగా నాకు అనిపించడం లేదు."

అక్షత ప్రస్తావించిన 'ఆవిడ' మా అమ్మ దశావతి. 'మీరు' అన్నది నన్నూ, అన్నయ్యనూ, నాన్న ప్రభాకర్‌నూ.

అక్షత ఆవేశం కాకపోతే అమ్మను మేము కాక తాను అర్థం చేసుకుంటుందా? అత్తను అర్థం చేసుకున్న కోడలు! హుఁ... బాగానే ఉంది వ్యవహారం.

అటు తిరిగి ఇటు తిరిగి తన మీదకు పిడుగులు పడింది ఉరుము ఉరిమి మంగళం మీద పడినట్లుగా.

అమ్మ కాపురానికి వచ్చి నలభై ఏళ్ళ పైమాటే. కాదు మరి. తానే నలభైకి చేరువలో ఉన్నాడు.

ఈ నలభై ఏళ్ళ పై చిలుకు కాపురంలో నాన్న అమ్మను అర్థం చేసుకోలేనిది అక్షత అర్థం చేసుకుంటుందా? అంతా ఆమె భ్రమ.

ఎవరినీ ఎవరూ అర్థం చేసుకోలేరు- అపార్థాలు పెడర్థాలు తప్ప.

అందులోనూ అమ్మలో అర్థం చేసుకోలేనంత నిగూఢత ఏం ఉంది కనుక.

"నిగూఢత ఆమె నిశ్శబ్దంలో ఉంది." అక్షత ఆ మాటకి టక్కున సమాధానం ఇచ్చింది.

అక్షత తన తరం కొలబద్దతో అమ్మను కొలవడానికి ప్రయత్నిస్తోంది. అక్షత తరాజులో అమ్మను ఎలా తూచగలం? అమ్మ భారమే అవుతుంది మరి.

అమ్మలోని సరళత అక్షతకు స్తబ్ధతగా తోచవచ్చు.

అమ్మలోని విధేయత అక్షతకు విధ్వంసంగా

అనిపించవచ్చు. కానీ, అమ్మ అమ్మే. అక్షత అక్షతే.

ఆ సంగతి అవగాహన చేసుకోలేనిది అక్షతే.

"అదేం కాదు." అక్షత ఖరాఖండిగా అంది. "నా అవగాహన కాదు ఇక్కడ సమస్య. ఆమె పట్ల నీ నిర్లిప్త వైఖరి. అది నిర్లక్ష్యంగా మారి కూర్చుందనే."

అమ్మ పట్ల నిర్లక్ష్యమా? నిర్లిప్తతా?

ఏమిటో అక్షత ఉద్దేశం?

తనకో బుడ్డాయి కొడుకులా నిలబెట్టాలనా? బాధ్యత లేని కొడుకులా నగుబాటు చేయాలనా?

"నీవు ఏ నిర్ణయం తీసుకున్నా రేవండరూ ఆడిపోసుకొనేది కోడలినైన నన్నే. నిన్ను కాదు."

ఊఁ... అదీ సంగతి.

"అలాంటప్పుడు మీరు తీసుకోబోయే నిర్ణయంలో నేను భాగస్వామిని కావాలనుకోవడంలో తప్పేమీ లేదుగా?"

"లేదు."

"మరి విషయాన్ని నాతో సావధానంగా చర్చించడానికి మీరెందుకు వెనకాడుతున్నారు?"

"ఇప్పుడు కొత్తగా చర్చించడానికి, నిర్ణయాలు తీసుకోవడానికి ఏమీ లేదు అక్షతా. అన్ని నిర్ణయాలూ ఎప్పుడో తీసుకున్నాం."

"నాతో మాట మాత్రమైనా చెప్పకుండానే." అక్షత కళ్ళు పెద్దవి చేసి అంది. ఆమె కళ్ళలో కదలాడింది ఆశ్చర్యమో, కోపమో.

మా ఇద్దరి మధ్యనా నిశ్శబ్దం బరువుగా వేళ్ళాడింది. ఆ శీతాకాలం ఉదయం లానే.

ఇక అక్షత ఆ విషయం వదిలేస్తుందనుకున్నా.

కానీ, ఈ సారి మాటలు మరింత తేటగా, మాటుగా వచ్చాయి.

"కనీసం అత్తయ్యనైనా అడిగారా?"

అక్షత ఆగ్రహాన్ని మరిచిపోయి మరీ పెళ్ళున నవ్వేశాను. నవ్వాగాక అన్నాను: "అమ్మకు ఏమి తెలుసని అడగాలి? ఆమెకు మేం ఎంత చెపితే అంత."

నా నవ్వుతో అక్షతకు చిర్రెత్తుకు వస్తోందని నాకు తెలుస్తోంది. అంత కోపాన్ని అణుచుకొని అక్షత గంభీరంగా అంది, "సరే చెప్పండి. మీరంతా కలిసి ఏమని తీసుకున్నారు నిర్ణయం?"

ఏముందీ, నాన్న అమ్మకు అనాయాస మరణం కావాలన్నాడు. ఆమె శేష జీవితం ప్రశాంతంగా గడిపి నాన్న సమక్షంలో తృప్తిగా కళ్ళు మూస్తే చాలన్నాడు. చికిత్స పేరుతో ఆమెను కష్టపెట్టడం తనకు ఇష్టం లేదన్నాడు..."

"అదీ ప్రముఖ కార్డియోథోరాసిక్ సర్జన్ అయిన మీ అన్నయ్యా, ప్రఖ్యాత ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ అయిన మీరూ ఒప్పుకొన్నారు!"

"అంతేగా మరి. నాన్న మాటే మా మాట." భుజాలెగరేశాను. అక్షత మాటలను హేళన చేస్తున్నట్లుగా.

"అయితే, అత్తయ్య ఏ నొప్పీ రొప్పూ లేకుండా పువ్వులా రాలిపోబోతున్నారన్నమాట." అక్షత చల్లగా అనేసి చరచరా వెళ్ళిపోయింది.

అక్షత మాటల్లోని చల్లదనం నన్ను ఒక్కసారిగా చుట్టుముట్టేసింది. ఉక్కిరిబిక్కిరి చేసింది. తొలి కిరణాల తాకిడికి నేల కమ్మేసిన శీతాకాలపు పొగమంచులా.

అక్షతతో వాదనలో నెగ్గాలని అలా తేలిగ్గా భుజాలెగరేశానే కానీ, ఆమె మాటలను ఆషామాషీగా కొట్టిపారేయలేను. అక్షత అన్నది నిజమే.

అమ్మ పండుటాకులా రాలిపోవడం లేదు. సుడిగాలిలో గిజగిజలాడుతూ, వడగాలిలో గింజుకులాడుతూ ఆమె ప్రాణం ఆమె శరీరం చుట్టూ గింగిరాలు కొడుతోంది.

ఉండలేక, వదలలేక.

అమ్మ శరీరంలోని నరనరాన్ని నలిపేస్తోన్న ఈ నరకయాతన సునాయాసమా? అనాయాసమా?

నా పేరు పక్కన వినయంగా వరుసదీరిన ప్రపంచంలోని ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల డిగ్రీలన్నీ సమాధానం చెప్పలేక తెల్లమొహం వేశాయి.

అమ్మను గురించిన ఆలోచనలన్నీ ఒక్కసారిగా నన్ను చుట్టుముట్టాయి.

నాన్న, అమ్మను పెళ్ళిచేసుకొనేప్పటికి అమ్మ ఎస్సెల్సీ చదువుతోంది. తాతయ్య తన ఒక్కగానొక్క కూతురితో పాటు ఏడు వారాల నగలూ, పన్నెండెకరాల మాగాణి, పాతిక ఎకరాల మెట్ట, అయిదెకరాల కొబ్బరి తోట, రెండెకరాల మామిడి తోపూ నాన్న చేతిలో పెట్టాడు.

అన్నింటినీ అమ్మేసి నాన్న ఢిల్లీ పయనమయ్యాడు.

ఢిల్లీ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తూ డీన్‌గా రిటైరయ్యాడు. నలభై పుస్తకాలు, వందల కొద్దీ సిద్ధాంత వ్యాసాలూ ప్రచురించాడు. ప్రపంచంలోని అనేక విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉండేవాడు.

అన్నయ్య, అక్క, తానూ ఈ రోజు ప్రతిభతో పాటు ప్రఖ్యాతిని సొంతం చేసుకోగలిగామంటే అది నాన్న చలవే. నాన్న ప్రణాళికా బద్ధమైన క్రమశిక్షణ తామందరినీ తీర్చిదిద్దింది. అందుకే ఆయనంటే, ఆయన మాటంటే అపారమైన గౌరవం అందరికీను.



నాన్నకు ఓపెన్ హార్ట్ సర్జరీ అయినప్పటి నుంచీ అన్నయ్య దగ్గరే ఉంటున్నాడు. ఎప్పుడైనా నా దగ్గరకు వచ్చి అమ్మను చూసి వెళుతుంటాడు. అంతకన్నా నాన్న ఏం చేయగలడు?

అమ్మ కదల లేదు. నాన్న కలవ లేదు.

మొదటి నుంచీ అంతే. ఇద్దరూ భిన్నధ్రువాలు.

అమ్మకు ఏమీ తెలియదు. నాన్నకు ఈ విషయం తెలుసు.

అందుకే మమ్మల్ని పదే పదే హెచ్చరిస్తూ ఉండేవాడు. "ఆమె మాటలు పట్టించుకోకండి. అవి తలలో దూర్చుకున్నారంటే ఎందుకూ పనికి రాకుండా పోతారు. ఆమె లాగా దద్దమ్మల్లా తయారవుతారు!"

నిజానికి అమ్మ మాట్లాడేదే తక్కువ. మాతో మరీ తక్కువ. కనుక ఆమె మాటల ప్రభావంలో మేం కొట్టుకు పోయే ప్రమాదం ఎన్నడూ రాలేదు. ఆమె ప్రతి పలుకుపై నాన్న కాపలా ఎలాగూ ఉండేది.

ఏదో కఠిన నియమావళిని పాటిస్తున్నట్లుగా నిబద్ధతతో నిశ్శబ్దంగా ఆమె పని ఆమె చేసుకుపోతూ ఉండేది.

కానీ ఆమె నిబద్ధత ఎప్పుడు బద్దలవుతుందో, ఆమె నిశ్శబ్దం ఎప్పుడు తరంగమై, ఉవ్వెత్తున లేస్తుందో ఆ రహస్యం నాకు తెలుసు.

అది అమ్మమ్మ గారింటి నుంచి ఉత్తరం వచ్చినప్పుడు, అందులోని అక్షరం అక్షరం తడిమి తడిమి తబ్బిబ్బైనప్పుడు అమ్మ ముఖంలో చిప్పిల్లిన సంతోషం, సంబరం నాకింకా గుర్తుంది. ఊరిలోని వారి కబుర్లన్నీ పేరుపేరునా మోసుకువచ్చే ఆ ఉత్తరాలంటే అమ్మకు ప్రాణం. అమ్మకు పుట్టింటి రాకపోకలన్నీ ఆ లేఖలేగా మరి!

ఢిల్లీ వాతావరణం అమ్మకు అచ్చొచ్చింది. పెరటిలో పూలు, కూరగాయలు పెంచేది. విత్తనాలు నాటుతున్నప్పుడు, పాదులు తీస్తున్నప్పుడు, మొక్కల్ని మెత్తగా నమిలేస్తున్న నత్తల్ని ఏరిపారేస్తున్నప్పుడు, మంచుపడి మాయమయ్యే లోగా విత్తనాల్ని, దుంపల్ని భద్రం చేస్తున్నప్పుడు అమ్మ మరో లోకంలో ఉండేది.

"మా ఊళ్ళోని ప్రతి ఇంటి పెరట్లో ఇప్పుడు బంతులు, చేమంతులు విరగ బూసి ఉంటాయి."

"ఊరంతా ముగ్గులు పెట్టి గొబ్బిళ్ళు ఆడుతుంటారు. సంక్రాంతి సమయం కదా"

"వేసవి మొదలయింది. మల్లెపూలు గుబాళించే సమయం వచ్చింది."

"సాయంత్రం పూట కళ్ళాపు చల్లి, ముగ్గులేసుకుని, ఆరుబయట నవారు మంచం మీద నడుం వాల్చి, ఆకాశంలోని నక్షత్రాలు లెక్కబెడుతూ, కబుర్లు చెప్పుకుంటుంటే, అబ్బో!"

అలా అంటున్నప్పుడు అమ్మ ముఖం ఎలా ఉండేదో నాకు ఇంకా స్పష్టంగా గుర్తుంది. పుట్టింటి జ్ఞాపకాల వెలుగులో, అయిన వాళ్ళను వీడి వచ్చిన వెలితి ఆమె ముఖంలో దోబూచులాడేది.

"ప్రవీణ్!" అంతలోనే నాన్న హుంకరింపు.

అంతే! తాను ఒక్క పరుగు తీసేవాడు, అమ్మకు ఆమడ దూరంగా.

ఇప్పుడు అనిపిస్తోంది. అమ్మ ఇంకా ఏమేమి చెప్పాలనుకునేదో.

అమ్మకి ఇంగ్లీషు రాదు, హిందీ రాదు. డ్రైవింగ్

రాదు. ఎక్కడికైనా వెళ్ళాలంటే నాన్నే తీసుకు వెళ్ళేవాడు. అన్నయ్యకి కాస్త మాటలు రాగానే దుబాసీ వ్యవహారం మొదలు పెట్టాడు. ఒక్కోసారి విసుక్కునేవాడు, "నాన్నా అమ్మకీ ఇంగ్లీషు నేర్పించు. మాటిమాటికి నన్ను చంపుకు తింటోంది!"

నాన్న అనేవాడు, "ఆ మట్టి బుర్రకి అంత త్వరగా ఎక్కదురా బాబూ. వచ్చేదయితే ఈ పాటికే నాలుగు ముక్కలు వచ్చేసేది. అయినా ఆమె పక్కన కూర్చుని ఏబిసిడిలు నేర్పించడానికి నాకు తీరిక ఎక్కడిది? ఇకపోతే మనం ఎవరో ఒకరం ఆమె పక్కన ఉంటూనే ఉంటాం. మరి ఆమె అర్జంటుగా ఇంగ్లీషు నేర్చుకోవలసిన అవసరం ఏముంది?"

నిజమే. మాతో పాటు అమ్మ అంగీకరించింది.

అలా ఆమె భాషతో పాటు ఆమె కదలికలు నిర్జయమైపోయాయి.

అమ్మకు ఇంగ్లీషు రాకపోవడంతో మాకూ, నాన్నకు ఓ సౌలభ్యముంది. బోలెడంత స్వేచ్ఛ ఉంది. మేం నలుగురం ధారాళంగా చర్చించుకునే విషయాల్లో, వాదించుకునే విషయాల్లో, నవ్వుకునే విషయాల్లో, ఆనందించే విషయాల్లో ఆమె నిశ్శబ్దమైపోయింది.

అయినా అమ్మ ఎన్నడూ చిన్నబుచ్చుకోలేదు. మా మాటలను మురిపెంగా వింటూ ఉండేది. మేం ఏం చేసినా ఆమెకు అపురూపమే. దూరంగా నిల్చునే మెటికలు విరిచేది. నాన్న అడుగుల చప్పుడు వినిపించడం ఆలస్యం, పిల్లిలా వంటింట్లో దూరేది.

మొదట్లో బయట అలవాటుకొద్దీ పిల్లలం మాలో మేం ఇంగ్లీషులో మాట్లాడుకుంటున్నా అమ్మానాన్నలతో తెలుగులో మాట్లాడేవాళ్ళం. నాన్న నలుగురమూ ఇంగ్లీషులోనే మాట్లాడాలన్న కఠిన నియమం పెట్టింది అమ్మ వల్లనే.

అదెలాగ అంటే, ఆ రోజు ఎప్పటిలాగానే అమ్మ వంటింటి నేల మీద కత్తిపీట పెట్టుకొని కూరగాయలు తరుగుతోంది. ఆమె అలా చేయడం నాన్నకు ఇష్టం లేదు. తన మిత్రుల ఇళ్ళల్లోలాగా చాకుతో కోయమనేవాడు. అమ్మకు చేతకాదు. అమ్మ నేల మీద చతికిలబడడం, కత్తిపీట చుట్టూ కూరగాయలు పరచుకుని తరగడం చిన్నతనంగా అనిపించేది. "పల్లెటూరి గబ్బిలాయి వేషాలు" అని చీవాట్లు పెట్టేవాడు.

అందుకేనేమో అమ్మ ఆయన వచ్చే లోపల గబగబ కూరగాయలు తరిగి ట్రేలలో సర్దేసేది. వాటి పక్కనే ఓ చాకుని పెట్టి ఉంచేది, ఎందుకైనా మంచిదని.

పిల్లలు ముగ్గురిలో చిన్నవాడిననేమో అమ్మకి తానంటే ముద్దు. ఆమె గారాబాన్ని అలుసుగా తీసుకుని తను మారాం చేస్తూ సాగించుకునేవాడు. నిజం చెప్పొద్దూ, తనకు అమ్మ కూరగాయలు కోయడం చూడడమంటే ఎంతో సరదా.

అమ్మ చెప్పేది, "మా ఊళ్ళో ఎవరైనా ఊరబంతి పెడుతున్నారంటే చాలు. ఊళ్ళోని ఆడవాళ్ళంతా తలా ఓ కత్తిపీటతో తయారు. తాటాకు పందిళ్ళ కింద కూరగాయలు కుప్పలుగా పోసి, వాటి చుట్టూ గుండ్రంగా కూర్చుని రాత్రంతా కూరగాయలు తరుగుతారు. ఎన్ని కబుర్లో, ఎన్ని పరాచికాలో, ఎన్ని వేళాకోళాలో...! పాటలు కూడా పాడుతారు."

అమ్మ తన ఊరి కబుర్లు చెప్పడమే కాదు, కూరగాయలు తరిగేప్పుడు తానూ ఎంతో హుషారుగా ఉండేది. కులాసాగా కబుర్లు చెప్పేది. కథలు చెప్పేది. కూనిరాగాలు తీసేది.

ఒక్కోసారి అక్క కూడా తమతో చేరేది. ఇద్దరం పోటీలు పడుతూ అమ్మకు కూరగాయలు అందిస్తూ ఆమెకు మా చెవులప్పగించేవాళ్ళం.

రకరకాల కూరగాయలు చూస్తుండగానే చక్రాలుగా, చదరాలుగా, పొడవుగా, వెడల్పుగా, లావుగా, సన్నగా, చిన్నగా, పెద్దగా మారిపోవడం విచిత్రంగా ఉండేది. తరిగినవాటిని అమ్మ కుదురుగా అమర్చేది. ఎన్నెన్ని ఆకారాలో, ఎన్నెన్ని రంగులో... ఉల్లిపాయలు, టమాటాలు, వంకాయలు అన్నీను.

చకచక కదిలే అమ్మ వేళ్ళలో ఏదో లయ ఉండేది. తరగడంలోని ఆమె నైపుణ్యం ముచ్చట గొలుపుతూ ఉండేది. మాకు ఏదైనా చెబుతున్నప్పుడు ఆమె ముఖంలో ఏదో వింత వెలుగు నిండి ఉండేది. మా సాన్నిహిత్యమో, ఆ కొద్దిసేపటి ఆమె స్వాతంత్ర్యమో ఏమో మరి!

"...పరోపకారార్థమిదం శరీరమ్... ఏ విధమైన ప్రతిఫలాన్నీ ఆశించకుండా ఆవులు పాలిస్తాయి. నదులు ప్రవహిస్తాయి. చెట్లు ఫలిస్తాయి. అలాగే ఇతరులకు మేలు చేయడం కోసమే ఈ శరీరం ఉంది."

**"అవును. కిడ్నీ మార్పిడి చేసి, అమ్మ జీవిత కాలం పొడిగించడం అనవసరం." అంతేమరి! నేను, అన్నయ్య, నాన్న ఏకాభిప్రాయాన్ని ప్రకటించాం.**

అక్కయ్య, తానూ అమ్మ కంఠమాధుర్యంలో పరవశులై ఉన్నారు.

నాన్న ఎప్పుడు వచ్చాడో, మమ్మల్ని ఎప్పటి నుండీ గమనిస్తూ ఉన్నాడో... ఒక్కసారి గొంతు సవరించుకున్నాడు. అంతే.

అమ్మ మళ్ళీ జీవితంలో కత్తిపీట ముట్టుకోనూ లేదు, ఆమె ముఖంలో చిరునవ్వు చెరగనూ లేదు. ఆమె పనులు ఆమె మౌనంగా చేసుకోవడం మారనూ లేదు. అమ్మతో తాము రహస్యంగా తెలుగులో మాట్లాడడం మాననూ లేదు.

అదే మంచిదయింది. అన్నయ్య, తానూ, మరికొందరు లండన్ వైద్య మిత్రులతో కలసి తెలుగుగడ్డ మీద కార్పొరేట్ హాస్పిటల్ ప్రారంభించాలన్నప్పుడు అక్కరకు వచ్చింది.

"గుడ్మార్నింగ్ సార్!" వంటమనిషి కంఠం నా ఆలోచనల్లోంచి నన్ను బయట పడేసింది. "కాఫీ సార్." వినయంగా ట్రేను నా ముందున్న టీపాయ్ మీద పెట్టింది. "మేడం జిమ్‌కి వెళ్ళారు సార్. మీకు చెప్పమన్నారు." వంటమనిషి వెళ్ళిపోయింది.

ట్రే వంక చూశాను. పాలు, కాఫీ పొడి, చక్కెర వేటికవి విడిగా ఉన్నాయి. వంటమనిషి చేసే కాఫీ అధ్వాన్నంగా ఉంటుందని అక్షతే ఈ ఏర్పాటును అలవాటు చేసింది.

ఇందుకే అక్షత అమ్మను అర్థం చేసేసుకున్నానంటూ మాట్లాడితే నాకు నవ్వాలో, ఏడవాలో అర్థం కానిది. అమ్మకు ఇల్లంటే ఎంత ప్రేమ, ఎంత గౌరవం. ఇంట్లోని మనిషి మనిషికీ కోరిన వంటలు వండి పెట్టడంలో గానీ, ఆపేక్షగా వడ్డించడంలో గానీ ఆమెకు ఆమే సాటి. ఇల్లూ, పిల్లలే ఆమెకు పంచప్రాణాలు.

అక్షత కూడా వంట చేయడంలో మంచి నేర్పరి.



ఉన్నట్టుండి ఓ రోజు హఠాత్తుగా ప్రకటించేసింది - తానిక వంట చేయబోవడం లేదని.

అదేం?

"నేను చాన్నాళ్ళుగా గమనిస్తున్నాను. పెట్టింది తినడం, గమ్మున లేచి వెళ్ళడం. కష్టపడి చేసిన వంట ఎలా ఉందో చెప్పడం అటుంచి కనీసం నేను తిన్నానా లేదా అన్నది పట్టించుకోకుండా చేతులు కడిగేయడం...! ఊ! ఒంటికాయ సొంటికొమ్ములా ఒక్కత్తిని కూర్చుని రాకాసి తిండి ఎలా తినను? పైనుంచి వంట చేసేప్పటి వాసనల వల్లో ఏమో తినకుండానే కడుపు తేములుకువస్తోంది. అక్కడికీ అప్పుడప్పుడు తినడం మానేసి చూశాను. మీరు కనీసం గమనించనైనా గమనిస్తారేమోనని. ఊహూ! మీరూ, మీ వెనకే పిల్లలూ...! నలుగురం కూర్చుని నాలుగు మాటలు కలబోసుకుంటూ సాదక బాధకాలు వెళ్ళబోసుకుంటూ, గలగలమంటూ భోజనం పంచుకుంటే ఎలా ఉంటుంది? మీరు మారరు. ఈ భాగ్యానికి నేను వండినా ఒకటే, వంటమనిషి వండినా ఒకటే. ఆప్యాయంగా వండి, ఆత్మీయంగా వడ్డించేవారి ప్రాధాన్యం మీకు పట్టనప్పుడు ఇక అనుకుని ప్రయోజనం ఏముంది?"

అక్షత మాటంటే మాటే. ఆ తరువాత వంట ఇంట్లో అడుగు పెట్టిన పాపాన పోలేదు. తరచూ మారే ఆ వంటమనుషుల అవకతవక తిండి తినక తప్పడం లేదు.

ఏ మాట కామాట. వంట మానేశాక అక్షతకి బోలెడంత తీరిక దొరికింది. న్యూయార్క్‌లో ఉన్నప్పుడు ఆమె కాలక్షేపానికి నేర్చుకున్న ఇంటీరియర్ డెకరేషన్‌ను వృత్తిగా మలచుకుంటానని అన్నప్పుడు నేను అడ్డుపడలేదు. నిజానికి అడ్డుపడినంత మాత్రాన నా మాట చెల్లుతుందన్న నమ్మకం నాకు లేదు. పై నుంచి నన్నొక సనాతన భావాల సద్దిమూట అంటూ నిర్దాక్షిణ్యంగా వేసే ముద్ర నుంచి గౌరవంగా తప్పించుకోవచ్చు. నా మర్యాద నేను కాపాడుకోవచ్చు. అయినా ఇంట్లో అక్షత చేసే పనేమీ లేదు. పిల్లలు డూన్ స్కూల్‌లో చదువుకుంటున్నారు. నాకేమో క్షణం తీరిక ఉండదు. అక్షతకు ఏదో ఒక వ్యాపకం లేకపోతే నన్ను చీల్చిచెండాడడమే ఆమె వ్యాపారమై కూర్చోదూ?

ఎన్నడూ లేనిది అక్షత ఇవాళ ఉదయాన్నే మొదలు పెట్టింది, వాదించడం. ఛ! నేను యాంత్రికంగా కాఫీ కలుపుకుని తాగేసిన కప్పును యథాస్థానంలో పెట్టాను. కాఫీ ట్రేలోనే మడిచి ఉంచిన దినపత్రికను యథాలాపంగా అందుకున్నాను.

స్త్రీలను విద్యావంతులను చేయడంలోనే దేశ సౌభాగ్యం దాగి ఉందని ముఖ్యమంత్రి గారి ఉవాచ. "విద్యావంతులను చేయాల్సింది ఆడవాళ్ళను మాత్రమే కాదు ప్రవీణ్, మగవాళ్ళను కూడా!" అక్షత కంఠం ఎక్కడి నుంచో పలికింది. "పేరు పక్కన డిగ్రీలను పేర్చి పెట్టే విద్య కాదు కావాల్సింది. సాటివారిని సానుభూతిగా అర్థం చేసుకోగల సంస్కారాన్ని నేర్పించే విద్య కావాలి. తోటివారి స్వతంత్రాన్ని గౌరవించగల సభ్యతను నేర్పించే విద్య కావాలి. ప్రతి ఒక్కరితోనూ ప్రేమతో, కారుణ్యంతో, బాధ్యతతో వ్యవహరించగల ప్రవర్తనను నేర్పించే విద్య కావాలి."

నేను అప్రయత్నంగా చేతిలోని పేపర్‌ను టీపాయ్ మీద ఉంచి, అమ్మ గది వైపు వెళ్ళాను.

"గుడ్మార్నింగ్ డాక్టర్!" అక్కడున్న నర్స్ విష్ చేసింది.

అమ్మ కండిషన్ అడిగి తెలుసుకుని, ఆమెను బయటకు వెళ్ళమని సైగ చేశాను. నర్స్ నెమ్మదిగా బయటకు వెళ్ళింది. కుర్చీని అమ్మ మంచం దగ్గరకు లాక్కుని కూర్చున్నాను.

అమ్మ ముఖం వైపు పరీక్షగా చూశాను. ఈ రోజు నా చూపుల్లో ఏదో తేడా ఉంది. అది రోజూ చూసే డాక్టర్ చూపులు కావు. ఆమె చర్మాన్ని, మాంసాన్ని, రక్తాన్ని, బొమికల్ని దాటుకుని ఆమె హృదయాన్ని తడిమే ప్రయత్నం చేస్తున్నాయి. కొత్తగా, వింతగా!

అమ్మ స్పృహలో లేదు. అచేతన స్థితిలో ఓ ఆకారంలా పడి ఉంది. ఆమె శరీరమూ, ఆమె ప్రాణమూ ఆమెను చెరో పక్కకు లాగేస్తున్నాయి. బాధనంతా ఆమె భరిస్తూనే ఉంది. నిశ్శబ్దంగా, నిర్మలంగా, ఎప్పటిలానే.

ఇక ఇప్పుడు లాభం లేదు. ఏమీ చేసే అవకాశమూ లేదు.

నిశ్చలమైన ఆమె ముఖంలో గూడు కట్టుకున్న నిగూఢత నన్ను నిలదీస్తున్నట్లనిపిస్తోంది. అమ్మ గురించి... కాదు కాదు. అక్షత అన్నట్లుగా అమ్మ శరీరం గురించి నిర్ణయం తీసుకున్న రోజు ఇంకా గుర్తుంది.

నాన్న, అన్నయ్య, తానూ... ముగ్గురికీ మూడు నిమిషాలు పట్టలేదు.

తమ నిర్ణయాన్ని మూడు ముక్కల్లో నిర్ధారించేశారు. అమ్మ శరీరస్థితి గురించి నాన్నకు వివరించగానే నాన్న ఏమేం చేయవచ్చునో అడిగారు. "కిడ్నీ మార్పిడి చేయాలి. కిడ్నీ దాత దొరికే వరకు డయాలసిస్ చేస్తూ ఉండవచ్చు."

"దానివలన లాభమేమిటి?"

"అమ్మ జీవితకాలం పొడిగించవచ్చు."

"పొడిగించి?" నాన్న అర్థంతరంగా ఆగిపోయారు.

నేను, అన్నయ్య నాన్న అభిప్రాయాన్ని లిప్తపాటులో అర్థం చేసుకున్నాం. అవును. ఆమె జీవితకాలం పొడిగించడం అనవసరం! అంతే మరి! ముగ్గురం ఏకాభిప్రాయాన్ని ప్రకటించాం.

అమ్మకు జీవితం ఏమిటి? ఇల్లు, పిల్లలు. అప్పటికే అన్నయ్యకూ, అక్కకూ పెళ్ళిళ్ళు అయిపోయాయి. నా పెళ్ళి కుదిరింది. అక్క పిల్లలు హైస్కూలులో అడుగుపెట్టారు. కాబట్టి ఆడపిల్ల పురుళ్ళూ, పుణ్యాలు లాంటి బాధ్యతలు అమ్మకు లేవు. ఇంతకన్నా అమ్మకు జీవించదగ్గ జీవితం ఏముంటుంది?



విషయం తెలిసి అక్క ఒక్కసారిగా గొల్లుమంది. ఎంత చదువుకున్నా ఆడవాళ్ళతో ఇదే గొడవ. ఏ విషయాన్నీ వాస్తవ దృష్టితో అవగాహన చేసుకోరు. అక్క కొడుకు శశి చిచ్చర పిడుగు. నన్ను నిలదీశాడు, "మామయ్యా, అమ్మమ్మను అలా ఎలా వదిలేస్తాం? ఏదో ఒకటి చేయి మామయ్యా. నువ్వు ఎంతమందికో కిడ్నీలు మార్పిడి చేశావ్ కదా. అమ్మమ్మకు చేస్తే ఏం మామయ్యా..."

నాకు నవ్వాగింది కాదు. గుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించినట్లు- ఏం చేస్తాం, వాడికి సమాధానం చెప్పాల్సి వచ్చింది! వాడి ముఖంలోకి చూశాను. ఆవేశంతో పాటు అమాయకత్వం కలగలసి ముఖం ఎరుపెక్కి ఉంది.

"ఏరా అబ్బాయ్, కిడ్నీ మార్పిడి అంటే ఏదో అపెండిసైటిస్ లాంటి ఆపరేషన్ అనుకుంటున్నావా? చాలా పెద్ద ఆపరేషన్. కిడ్నీ మార్చినా అది శరీరంలో ఇముడుతుందో లేదో తెలీదు. ఇమిడినా జీవితాంతం మందులు వాడుతూ ఉండాలి. అన్నిటినీ మించి కిడ్నీ దొరకడమే గగనం. దొరికిన కిడ్నీ అమ్మకు సరిపోవాలి." నేను శశి ముఖం వంకే చూస్తూ చెబుతున్నాను. "కుటుంబ సభ్యులెవరైనా దానం చేయవచ్చు. కానీ ఎవరం చేస్తాం? అసలు ఇంత బాధ ఎందుకు చెప్పు."

"నా కిడ్నీ ఇస్తాను మామయ్యా!" వాడు టక్కున అన్నాడు.

నేను ఆశ్చర్యంతో వాడి వంక చూశాను.

"అమ్మమ్మ అంటే నాకు చాలా ఇష్టం మామయ్యా. అంతకు ముందు నువ్వు ఎన్నిసార్లో ఆర్గాన్ డొనేషన్ మీటింగ్స్‌లో చెప్పావు కదా మామయ్యా! మా స్కూల్ మీటింగ్స్‌లోనూ చెప్పావు, ఒక కిడ్నీ దానం చేసినా ఏమీ కాదని. మామయ్యా, ప్లీజ్ యాక్సెప్ట్ మై కిడ్నీ! ప్లీజ్ మామయ్యా..."

శశి గొంతులోని వణుకు, కళ్ళలో తడి ఒక్క క్షణం నన్ను కదిలించాయి. ఎదిగీ ఎదగని వయను. ఉద్వేగం, ఉద్రేకం మిళితమై తమాషాగా ప్రకటితమవుతుంది. అంతే. అనుభూతి అన్న భూతం పట్టుకొంటే ఆవేశం వచ్చి పడుతుంది. నేను సంభాళించుకుని శశిని సముదాయించాను.

"శశీ! నిజమేరా. నేను ఎన్నెన్నో మీటింగ్స్‌లో చెప్పాన్నా. కొన్ని వందల ఆపరేషన్లు చేశాన్నా. అయినా, ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నానను కున్నావ్? నీవింకా చిన్న పిల్లాడివి. పెద్దాడివి అయితే నీకే అర్థం అవుతుంది. నీ ఒళ్ళు గుల్ల చేసి ఆమె జీవితకాలం పొడి'ంచి ఎవరిని ఉద్ధరించాలి?

ఏం సాధించాలి?"

ఆనాడు శశికి ఎలాగోలా సర్దిచెప్పినా, అక్క ఇప్పటికీ ఆ విషయంలో అసంతృప్తిగా ఉందని నాకు తెలుసు.

ఏం చేస్తాం? అందరినీ తృప్తిపరచడం ఎవరివల్లనవుతోంది?

ఇన్నాళ్ళకు మళ్ళీ అక్షత నిలదీస్తోంది. జరిగిన దానికంతా నన్నే దోషిగా నిలబెడుతోంది.

అమ్మ చాలా కాలంగా డయాబెటిక్. సుగర్ కంట్రోల్‌లో ఉంచుకోక ఆహార నియమాలు పాటించక ఇంత దూరం తీసుకువచ్చింది. ఆ మాటే ఉదయం అక్షతతో అన్నాను.

"అది అమ్మ మూర్ఖత్వం. కోరి తెచ్చుకుంది."

"అలా కొట్టిపారేయొద్దు ప్రవీణ్. కాస్త ఒళ్ళు వెచ్చబడితేనే ఎవరైనా పక్కనుండి బాగోగులు చూస్తే బావుండనిపిస్తుంది. అలాంటిది ఇటువంటి జీవిత కాలపు జబ్బుతో వేగడానికి కుటుంబ సభ్యులందరి సహకారం ఉండొద్దూ? ఆమె తిండీతిప్పల గురించీ, మందూ మాకుల గురించీ అడిగినవారున్నారా? ఆ ఏకాకి తనంతోనే విరక్తి భావన పుట్టేది. అందుకేనేమో ఆమె అలా..."

నిజమే. చిన్నప్పుడు తనకెప్పుడైనా జ్వరం వస్తే మాత్ర వేసుకోవడానికి ఎంత మరాం చేసేవాడు. అమ్మ ఆ మాత్రను పొడి చేసి తేనెతో రంగరించి, తనను బతిమిలాడి బామాడి, బుజ్జగించి లాలించి ఆ మాత్ర మింగేవరకూ వదిలేదేనా?

అమ్మను బుజ్జగించడం ఏం కర్మ, రోజువారీ మాత్ర వేసుకుంటుందో లేదో తానేనాడైనా అడిగేడా?

అక్షత అన్నట్లు ఓ పూట అమె పాలుమారి ఉండొచ్చు. కానీ, వంట చేయడంలో చేయి తిరిగిన అమ్మ ఎన్నాళ్ళో ఖాళీ కడుపుతో ఉపవాసం ఉండడం తనెరుగు. తినడానికి బోలెడన్ని పదార్థాలు. ఆమెకు ప్రత్యేకంగా వండుకోవాలని తట్టేదే కాదు. ఎందుకని?

అదే మాటను అక్షతను అడిగాడు. "ఆడవాళ్ళెవరైనా అంతే. అందరికీ అమర్చడంలోనే వారి ఓపిక అయిపోతుంది. ఇక తమకు ప్రత్యేకంగా వండుకోవడమా? అసంభవం."

ఆ మాటే అమ్మనూ అడిగేవాడు. "ఆకలి వేయడం లేదురా ప్రవీణ్. ఒక్క ముద్ద తిన్నా కడుపులోంచి ఎగతన్నుతోంది."

ఒక్కోరోజు రాత్రిళ్ళు ఎడతెగకుండా ఎక్కిళ్ళు వచ్చేవి. నిద్రలోంచి ఉదాటున లేచి కూర్చునేది. "నా పేగుల్ని తోడేస్తున్నాయిరా" అంటూ, "ఈ ఎక్కిళ్ళతోనే నా ప్రాణం పోయేట్టుందిరా..."

అమ్మ నాతో ఫిర్యాదులు చేయడం గమనించి నాన్న గదిమాడు, "వాడి పని వాడిని ప్రశాంతంగా చేసుకోనిస్తావా?" అంతే. ఇక అమ్మ ఏనాడూ తన శరీరం గురించి మాట్లాడలేదు.

నాకు ఏ ప్రశాంతతను ఇవ్వాలని నాన్న అమ్మ నోరు కుట్టేశాడో, ఆ ప్రశాంతతే ఇప్పుడు నన్ను అతలాకుతలం చేస్తోంది. నిలువునా కుదిపేస్తోంది.

అది పరితాపమో, పశ్చాత్తాపమో నాకే తెలియదు.

అమ్మ కిడ్నీలు పనిచేయడం మానేశాయి. మలినాలను వడపోయడమే కాదు, ఒంట్లోని నీటిని విసర్జించకుండా మొరాయించేశాయి. ఒంట్లోని నీరు ఒంట్లో ఉండి పోయింది. కాళ్ళూ చేతులూ, ముఖం ఒళ్ళూ చేరిన నీరు ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించింది.

అప్పుడు కూడా అమ్మ ఫిర్యాదు చేయలేదు. ఆయాసం ఎక్కువై ఊపిరితిత్తులు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసినప్పుడు మేం గమనించాం.

ఇన్నాళ్ళూ ఫిర్యాదు చేయకుండా ఉన్నందుకు నాన్న మరోమారు ఆమె మీద విరుచుకుపడ్డాడు. అమ్మకు చికిత్స ప్రారంభించాను. డయాలసిస్ చేస్తూ కొంత కాలం నెగ్గుకొచ్చాను. ఇక ఆ అవకాశమూ పోయింది. ఏడాది నుంచీ ఉలుకూ పలుకూ లేకుండా మంచంలో ఆకారమైపోయింది. ఒంట్లోని నీరు ఆమె గుండెను ఏ క్షణాన్నైనా చిదిమేయవచ్చు.

నా మనసంతా వికలమైంది. ఇదంతా ఇలా జరగవలసింది కాదు. అయ్యో.

నా చేయి అప్రయత్నంగా అమ్మ చేతిని తడిమింది. గుంభనంగా ముడిచిన తన గుప్పిట్లో అమ్మ ఎన్ని గుట్లు దాచిందో. ఆనాడే అమ్మ ఫిర్యాదులు విని ఉంటే...

నా ఆలోచన సాగలేదు. నేను శిలనైపోయాను.

"ప్రవీణ్" అక్షత నన్ను లోకంలోకి లాక్కొచ్చింది. నా ఎదురుగా మరో కుర్చీ వేసుకుని దగ్గరగా కూర్చుంది. నేను ఏమీ మాట్లాడకపోయేసరికి ఓ కవరు తీసి నా చేతిలో పెట్టింది నింపాదిగా.

మెడికల్ రిపోర్ట్స్ అక్షతవే. అక్షతకు డయాబెటిస్.

అయోమయంగా అక్షత ముఖంలోకి చూశాను. "మళ్ళీ ఇదేంటి?"

అక్షత వాతావరణాన్ని తేలిక పరచడానికి అన్నట్టు భుజాలెగరేసి పెదవి విరిచింది.

"మూడు రోజుల క్రితమే నేను డయాబెటిక్‌నని

**"నా భయం నాది. అత్తయ్యకు జరిగిన మర్యాదే నాకూ జరుగుతుందని నా ఆందోళన. ఎంతయినా తమరు ఆ తండ్రికి తగ్గ తనయులే కదా."**

తెలిసింది ప్రవీణ్. మరోసారి పరీక్షలు చేయించాక నీకు చెపుదాము లెమ్మని ఊరుకొన్నాను. నిన్న మళ్ళీ బ్లడ్ శాంపిల్స్ ఇచ్చివచ్చాను. ఇప్పుడే జిమ్ నుంచి వస్తూ రిపోర్ట్స్ తీసుకువస్తున్నా." అక్షత నా వంకే కన్నార్పకుండా చూస్తూ చెపుతోంది, "నేను ఇంటర్‌నెట్‌లో ఈ జబ్బు గురించి, చికిత్స గురించి, పర్యవసానం గురించి తెలుసుకొన్నాను. అత్తయ్య విషయంలో ఏం జరిగి ఉంటుందో నాకు అప్పుడు అర్థమైంది. అంతేకదా ప్రవీణ్... తన దాకా వస్తే కానీ నొప్పి తెలియదుగా..."

అక్షత గొంతు పూడుకుపోయింది. కాసేపాగి తానే అంది.

"మా నాన్న కూడా డయాబెటిక్. నీకూ తెలుసు కదా. ఆయనకు జిహ్వా చాపల్యం ఎక్కువ. అమ్మ ఆయనకు సమయానికి తగ్గట్టు అన్నీ అమర్చి పెట్టడానికి ఎంత తాపత్రయపడేదో. ఎక్కడెక్కడి పుస్తకాలన్నీ తిరగేసి ఆ జబ్బును గురించి తెలుసుకొనేది. ఎక్కడెక్కడ ఆ జబ్బును గురించి మీటింగ్ పెట్టినా పరిగెత్తుకు వెళ్ళేది. ప్రత్యేకమైన వంటలన్నీ నేర్చుకు వచ్చేది. అనుక్షణం ఆయనకు అంటిపెట్టుకు తిరిగేది. మాకప్పుడు అదంతా చాదస్తంగా తోచేది. ఆమె ఇంత తపన పడ్డా నోటికి అదురుగా లేవని తినే తినే పళ్ళాన్ని నాన్న అమ్మ ముకం మీద విసిరి కొట్టడం నాకు తెలుసు." అక్షత కళ్ళు తడి కట్టాయి.

నాకు అక్షత కస్సుబుస్సులే తెలుసు కానీ, కంట తడి ఎరుగను. ఓదార్పుగా ఆమె చేయి తట్టాను. అక్షత గొంతు సవరించుకొని అంది.

"ఈ రోజుల్లో సుగర్, బిపి అంటే భయపడేవారు లేరు. ఎంతో సాధారణమైపోయాయవి. అలాంటిది ఇద్దరు డాక్టర్ల తల్లి అయిఉండీ అత్తయ్యకు ఇంత దుర్భర పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆలోచిస్తే నాకెన్నో అగాధాలు కనిపించాయి."

నేనామె వంక ప్రశ్నార్థకంగా చూశాను.

"ప్రవీణ్, ఇక్కడ సమస్య కిడ్నీ మార్పు కాదు, మీరు తీసుకున్న నిర్ణయంలోని వివక్ష. అత్తయ్యకు అవసరం ఉండీ, మనకు అన్ని అవకాశాలూ ఉండీ కనీసం ఆ దిశగానైనా ఆలోచించలేకపోయాం. అదీ నా బాధ."

"కిడ్నీ మార్పిడి చాలా రిస్క్ అక్షతా. అర్థం చేసుకో." నేను నోరు విప్పాను.

"రిస్క్ అన్నది ఏ ట్రీట్‌మెంట్‌లోనైనా ఉండదూ? ఆంజియోగ్రాం చేసేప్పుడే కార్డియాక్ అరెస్ట్ వచ్చిన వారి గురించి మనం వినలేదూ? అంతమాత్రం చేత మామయ్యకు గుండె ఆపరేషన్ చేయడం మానేసి అలా వదిలేశామా? మామయ్యకు ఓపెన్ హార్ట్ సర్జరీ చేసి వాల్వ్ రీప్లేస్ చేయడం అత్యవసరమైతే, అత్తయ్యకు ప్రారంభ దశలోనే కిడ్నీ మార్పిడి చేయడం అత్యవసరం కాదా? ఆయన విషయంలో తీసుకున్న రిస్క్ ఈమె విషయంలో ఎందుకు తీసుకోలేదు? అదీ నాకు అర్థం కానిది."

"నాన్న ఒక మేధావి. ఆయన జీవితం సమాజానికి ఎంతో అవసరం." నేను అప్రయత్నంగా అన్నాను.

"ఏం. గృహిణి సమాజానికి అవసరం లేదా? నువ్వే ఇలా మాట్లాడితే ఎలా ప్రవీణ్? అతనైనా, ఆమె అయినా వైద్యుని దృష్టిలో రెండూ శరీరాలే. ఆ శరీరాల పట్ల నిర్ణయం తీసుకోవాల్సినా, చికిత్స చేయాల్సినా మానవ దృక్పథంలో ఒక్కటే. నీవు నేర్చుకున్న వైద్యాన్ని సమస్త మానవాళి సౌభాగ్యం కోసం వినియోగిస్తానని నీవు చేసిన హిపోక్రాటిక్ ఓత్ మర్చిపోయావా? ఏ వైద్య విధానాన్నైనా అందుకోవడం మనిషిగా ఆమె హక్కని మర్చిపోయావా?"

"అదంతా ఇప్పుడు ఎందుకు అక్షతా?"

"నువ్వేమయినా అనుకో ప్రవీణ్. నా భయం నాది. నేను అచేతనంగా ఉన్నప్పుడో, అపస్మారకంగా ఉన్నప్పుడో నా శరీరం విషయంలోనూ నీవు ఏదైనా కీలక నిర్ణయం తీసుకోవలసి వస్తే... అత్తయ్యకు జరిగిన మర్యాదే నాకూ జరుగుతుందేమోనని నా ఆందోళన. ఎంతయినా తమరు ఆ తండ్రికి తగ్గ తనయులే కదా."

అనవలసిన ఆ నాలుగు మాటలూ అనేసి అక్షత చక్కాపోయింది.

నా శరీరంలో ఒక విధమైన నిస్సత్తువ ఆవరించింది. అణువణువూ చచ్చుబడినట్లు నీరసం నిలువునా ముంచెత్తింది. లోలోపల్నించి జ్ఞాపకాల తెరల్ని తొలగించుకుంటూ వినిపించింది అమ్మ గొంతు. ఆమె మాటల్లోని మాధుర్యం, మార్దవం, మమత కలబోసుకుని గుండెల్ని పిండేసింది.

"ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఇతరులకు మేలు చేయడానికే ఈ శరీరం ఉన్నది. పరోపకారార్థమిదం శరీరం..."

అన్ని సంకోచాలనూ పక్కకు నెట్టి, ఒక్కసారిగా వెక్కివెక్కి ఏడ్చాను.

అమ్మ కోసం పసిపిల్లాడిలా.

మొట్టమొదటిసారిగా. ■